★

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ
20 వ మహాసభలో
వి. యం. మొలటోవ్
ఉపన్యాసం

★

व

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ

20వ మహాసభలో

వి. యం. మొలటోవ్

ఉపన్యాసం

★

విశాలాంధ్ర ప్రచురణాలయం
విజయవాడ

ప్రచురణ నెం. 151
ప్రథమ ముద్రణ - ఏప్రిల్ '56

వెల: 0—2—0

స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్
విజయవాడ - 2

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ మహాసభలో

మాలటోవ్ ఉపన్యాసం

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఇరువదవ మహాసభలో, సోవియట్ విదేశాంగమంత్రి, పార్టీప్రిసీడియం సభ్యుడుఅయిన, కామ్రేడ్ వి. యం. మాలటోవ్, అంతర్జాతీయపరిస్థితిపై ఇచ్చిన నివేదిక.

కామ్రేడ్స్, పంధొమ్మిదవ పార్టీమహాసభ అనంతరం మనం కొనసాగించిన కార్యక్రమాలను గురించి కామ్రేడ్ కృశ్చేవ్ తాను సమర్పించిన నివేదికలో స్పష్టంగా వివరంగా తెలియజేశారు. ఈ మధ్యకాలంలో పార్టీ కార్యకలాపాల అనుభవాలను కామ్రేడ్ కృశ్చేవ్ సూత్రీకరించారు. అంతేకాదు; ఆ నివేదిక నేటి అంతర్జాతీయ పరిస్థితులను గురించి ప్రతిభావంతమైన మార్క్సిస్టు లెనినిస్టు అవగాహనను కలిగిస్తున్నది. మన పార్టీని, సోవియట్ ప్రజలను ఎదుర్కొంటున్న నూతన ప్రధాన కర్తవ్యాలను నిర్దేశిస్తున్నది.

మన ప్రజలు నేడు ప్రశంసనీయంగా పురోగమిస్తున్నారు. యుద్ధానికి పూర్వమే మనం ప్రధానంగా సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకున్నాం. నేడు సోషలిస్టు సమాజంనుండి, కమ్యూనిస్టు సమాజానికి క్రమంగా పరిణామం చెందే దశలో ఉన్నాం. మనం చాల పెద్ద అవరోధాలను ఎదుర్కొన్నాం. మనశక్తినంతటినీ వెచ్చించి, ఒక్కొక్క సమయంలో, ముఖ్యంగా యుద్ధకాలంలో, అపారమైన త్యాగాలుచేసి ఆ అడ్డంకులన్నిటినీ అధిగమించాము.

ఇప్పటికీ పరిష్కారంకాని కొన్ని పెద్దసమస్యలు ఉన్నాయని కూడా మనకు తెలుసు. కాని కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన, మనం శక్తివంతంగా పురోగమిస్తున్నాము. కమ్యూనిజాన్ని స్థాపించే మార్గంలో ఎదురయ్యే కొత్తకొత్త క్లిష్టసమస్యలన్నిటినీ సామర్థ్యంతో పరిష్కరించుకుంటున్నాము.

సోవియట్ ప్రజలు ఐదవ పంచవర్ష ప్రణాళికను జయప్రదంగా పూర్తి చేసుకున్నారు. అంతేకాదు, ఆర్థికాభివృద్ధిలో ప్రణాళిక నిర్దేశించిన లక్ష్యాలను చెప్పుకోదగినంతగా అధిగమించారు. నేడు ఆరవ పంచవర్ష ప్రణాళికలో కొత్త

లక్ష్యాలను, మహోన్నత లక్ష్యాలను మనం చేబట్టాము. ఈ నూతన లక్ష్యాలను కూడా జయప్రదంగా నిర్వహించగలమని మనకందరకూ విశ్వాసముంది.

లెనినిస్టు పార్టీఐన మన పార్టీ, కార్మిక కర్షక ప్రజలమధ్య అభేద్యమైన ఐక్యతను ఏర్పరచింది. మన ప్రభుత్వానికిగల బలానికీ, పటుత్వానికీ, ఈ ఐక్యతే దృఢమైన పునాది. (హర్షధ్వానాలు) సమిష్టి క్షేత్రాలలోని రైతాంగానికి కార్మిక వర్గానికిగల అభేద్యమైన ఐక్యత మన సోషలిస్టు సమాజంలోగల రాజకీయ, నైతిక ఐక్యతకు పునాది. వివిధ సోషలిస్టు రిపబ్లికులలోని ప్రజలమధ్యగల ఐక్యతకు పునాది.

వ్యవసాయాభివృద్ధికి కృషి

పందొమ్మిదవ పార్టీమహాసభ అనంతరం, సమిష్టి క్షేత్రాలలోని రైతాంగానికి కార్మికవర్గానికి మధ్యగల ఐక్యతను దృఢతరం చేయడానికి, మన పార్టీ అనేక చర్యలు తీసుకున్నది. వ్యవసాయాన్ని అభివృద్ధిచేసే విషయమై మనపార్టీ ప్రత్యేకశ్రద్ధ వహించింది. అలా చేయటం సరియైనదికూడా. జాతీయ ఆర్థిక విధానముయొక్క సాధారణ అభివృద్ధికంటె, తీవ్రగతిని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలకంటె మన వ్యవసాయం వెనుకబడినందువలన పై చర్యలు అత్యవసరంగా తీసుకోవలసివచ్చింది.

ఆహారపదార్థాల విషయంలోను తదితర జీవితావసర వస్తువుల విషయంలోను ప్రజల అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వము, పార్టీ కొన్ని ప్రధానమైన కొత్తచర్యలు తీసుకోవలసివచ్చింది. వానిలో ప్రధానమైనవి ఇవి: సమిష్టిక్షేత్రాలలోని రైతులకు మెషీన్ ట్రాక్టరుస్టేషనులకు, ప్రభుత్వక్షేత్రాలకు వ్యవసాయోత్పత్తిని పెంచేందుకై అదనపు సౌకర్యాలను కలిగించాము. వారు ఉత్పత్తిచేసే వస్తువుల ధరలను సర్దుబాటుచేశాము. వ్యవసాయంలో యంత్రాలను ప్రవేశపెట్టే విషయంలో విస్తారమైన కృషి జరిగింది.

రసాయనిక ఎరువులను విశేషంగా వాడుతున్నాము. సమిష్టి క్షేత్రాలను, ప్రభుత్వ క్షేత్రాలను, మెషీన్ ట్రాక్టరు స్టేషనులను నిర్వహించటానికి అత్యధిక ప్రావీణ్యత సంపాదించిన నిపుణులను పంపుతున్నాము. వ్యవసాయ శాస్త్రజ్ఞులను తదితర నిపుణులను పంపుతున్నాము. గ్రామసీమలలోని పార్టీనిర్మాణాన్ని మరింత పటిష్టం చేయటానికి చర్యలు తీసుకున్నాము. ముఖ్యంగా ఇంతవరకు సాగులోకి రాని బీడుభూమిని సాగుచేసేందుకు ప్రత్యేకకృషి జరిగింది. తత్ఫలితంగా, ధాన్యం పంట పండేప్రాంతం ఇదివరకటికంటె 3 కోట్ల 30 లక్షల హెక్టారులు పెరిగింది (1 హెక్టారు 2½ ఎకరాలకు సమానం). పశుపోషణ కత్యవసరమైన మొక్కజొన్న పంటను అధికతరం చేసేందుకు ప్రత్యేకచర్యలు తీసుకున్నాము. పైచర్యలు,

ఇలాంటివే మరికొన్ని ముఖ్యచర్యలు తీసుకున్న ఫలితంగా మన వ్యవసాయాభి వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. సమిష్టి క్షేత్రాలలోని రైతాంగం వైచర్య లన్నిటినీ ఏకగ్రీవంగా బలపరచారు.

సమిష్టిక్షేత్రాలలోని రైతులజీవితప్రమాణాన్ని పెంచేందుకు పార్టీ, సోవియట్ ప్రభుత్వమూ ప్రత్యేకకృషి చేస్తున్నాయి. కమ్యూనిస్టుసమాజ లక్ష్య సాధనదృష్ట్యా గ్రామీణప్రజల జీవితస్థాయిని పట్టణప్రజల జీవితస్థాయికి సాధ్య మైనంత దగ్గరగా తీసుకురావటానికి కృషిచేస్తున్నాము. ఐదవ పంచవర్ష ప్రణా ళిక కాలంలో, సమిష్టిక్షేత్రరైతుల నిజమైన ఆదాయం నూటికి 50 వంతులు పెరి గింది. (వేతనాల రూపంలో కార్మికులకు ముట్టేధనాన్ని, జీవితావసర వస్తువుల లోకి మార్చినపుడు వచ్చే ఆదాయం నిజమైన ఆదాయం) అదేకాలంలో ఫ్యాక్టరీల లోను, ఆఫీసులలోను పనిచేసే కార్మికుల నిజమైన ఆదాయం నూటికి 39 వంతులు పెరిగింది. ఆరవ ప్రణాళిక కాలంలో, సమిష్టిక్షేత్ర రైతుల ఆదాయం 40 వంతులు పట్టణ కార్మికుల ఆదాయం, దాదాపు 30 వంతులు పెరుగుతాయి. పార్టీ అను సరిస్తున్న ఈ రాజకీయవిధానం, కార్మికుల, రైతుల ఐక్యతను మరింత దృఢతరం చేసి, ప్రభుత్వాన్ని మరింత పటిష్టంచేస్తుంది.

పరిశ్రమలను, రవాణా సౌకర్యాలను వీలైనంతవరకు అభివృద్ధి చేయటానికి మన పార్టీ నిరంతరం కృషిచేస్తూ వచ్చింది. ఇలా చేయటంలో మనం తప్పనిసరిగా పరిశ్రమలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ వచ్చాము. భారీ పరిశ్రమలు అభివృద్ధి ఐనపుడే వ్యవసాయం, జాతీయార్థిక విధానంలోని తదితరశాఖలు వృద్ధికాగలవు. మాతృదేశ రక్షణను పటిష్టంచేయాలన్నా, ప్రజలజీవనస్థాయిని పెంపుచేయాలన్నా, భారీ పరిశ్రమలను పెంపుచేయడం అత్యవసరం.

ఈ మధ్యకాలంలో, పరిశ్రమలలోని నైపుణ్యాన్ని పెంచటానికి మనం ప్రత్యేకృషి చేశాము. కార్మికుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేవిషయంలోను, పారిశ్రామిక ఉత్పత్తిని హెచ్చుచేసే విషయంలోను, మనకుగల అవకాశా లన్ని టినీ మనం పూర్తిగా వినియోగించుకోలేదని స్పష్టమైంది. ఇలా జరగాలంటే మనం అత్యంత ఆధునికమైన పనిముట్లను తగినంత పెద్ద సంఖ్యలో ఉత్పత్తిచేయాలి. అలా జరిగినపుడే పాత పనిముట్లను తొలగించి, వాటిస్థానే కొత్త పరికరాలను ఏర్పరచగలం. దీంతోపాటు, ఉత్పత్తిని క్రమబద్ధం చేసే విషయంలోకూడా ప్రత్యేకశ్రద్ధ వహించాలి. ఈ రంగంలో మనలో చాలా లోపాలున్నాయి. కేంద్రకమిటీ విస్తృత సమావేశంలోను, తదితర సమావేశాలలోను ఈ లోపాలు బహిర్గతమైనాయి. ఈ సమావేశాలలో పరిశ్రమలను నిర్వహించే కార్యకర్తలు, నిపుణులు, శాస్త్రజ్ఞులు, ఇదివరకటికంటె ఎక్కువగా పాల్గొన్నారు. పరిశ్రమల నుండి ఎక్కువ ఫలితాలను ఎలా పొందాలి అనే విషయమై అనేక సూచనలు

చేశారు. కేంద్రకమిటీ ఆధ్వర్యానజరిగిన ఈసమావేశ కార్యక్రమాలు, పరిశ్రమలను నిర్మాణ కార్యక్రమాన్ని, పెంపుచేసేందుకు గొప్ప ఉత్సాహాన్ని కలిగించింది.

పరిశ్రమలను సాఫీగా నిర్వహించటం చాలా అవసరం. అలా జరిగినపుడే నష్టాలు లేకుండా జాగ్రత్తపడగలం; ప్రణాళికాసూత్రాలను పరిశ్రమలకు అన్వయించగలం.

ఆరవ ప్రణాళికకాలంలో, పరిశ్రమలలోను, ఫ్యాక్టరీలలోను రోజుకు 7 గంటలపని ప్రవేశపెట్టబడుతుందని కామ్రేడ్ క్రుశ్చేవ్ తన నివేదికలో తెలియజేశారు. ఈ మార్పుతోపాటు, ఫ్యాక్టరీలలో, ఆఫీసులలో పనిచేసే కార్మికుల నిజమైన వేతనాలను చెప్పుకోదగినంతగా పెంచుతున్నాము. కార్మికవర్గంయొక్క జీవితప్రమాణాన్ని పెంపుచేయటానికి మనం ఎంతశ్రద్ధ వహిస్తున్నామో పైవిషయాలన్నీ తెలియజేస్తున్నాయి.

మన ఆర్థిక, వైజ్ఞానిక శాఖలలోని అన్ని రంగాలలోనుగల ప్రమాదకరమైన లోపాలను, మన పార్టీ ధైర్యంగా ఎట్టి దాపరికంలేకుండా బహిర్గతం చేస్తున్నది. ప్రభుత్వయంత్రాంగాన్ని అన్నివిధాలా అభివృద్ధిపరచి, మెరుగులు దిద్దటానికి, న్యాయసూత్రాలను ఖచ్చితంగా అమలుజరపటానికి, మనపార్టీ కృషిచేస్తున్నది. కార్మికులు, సమిష్టిక్షేత్ర రైతులు, మేధావులు, పైకార్యక్రమా లన్నింటిలోను ఉత్సాహపూరితంగా పాల్గొంటారని, పైచర్యలన్నిటినీ బలపరుస్తారని, పార్టీ ఆశిస్తున్నది; విశ్వసిస్తున్నది.

అంతర్జాతీయ రాజకీయాలలో ప్రధానమార్పులు

రెండవ ప్రపంచయుద్ధం సోవియట్ సోషలిస్టు సమాజ విధానానికి, సోవియట్ ప్రభుత్వానికి ఒక గొప్ప పరీక్షాసమయం. ప్రజల నిస్వార్థ సహకార కృషిపై ఆధారపడిన సోవియట్ ప్రభుత్వానికి అపారమైన భౌతిక నైతిక బల సంపదలున్నాయని, రెండవ ప్రపంచయుద్ధం రుజువుచేసింది.

రెండవ ప్రపంచయుద్ధ భారానికి గురిఐనప్పటికి, సోవియట్ ప్రభుత్వం యుద్ధానంతరం అతిస్వల్ప కాలంలోనే తిరిగి, ఆర్థిక సాంస్కృతిక పురోగమన పథాన్ని చేపట్టింది. సోషలిజాన్ని నిర్మించుకొంటున్న ప్రజాస్వామ్యదేశాలు సైతం, తమ కర్తవ్యాలను జయప్రదంగా నిర్వహిస్తున్నాయి.

చైనాతోను, తదితర సోషలిస్టు దేశాలతోను సోవియట్‌కుగల స్నేహసంబంధాలు ప్రధాన లక్ష్యాలలోగల ఐక్యతవల్ల స్నేహభావాల పునాదిపైన, చక్కగా అభివృద్ధి చెందుతున్నాయి. అనేక పరీక్షలలో నెగ్గి రాటుదేలిన కమ్యూనిస్టుపార్టీల, వర్కర్స్‌పార్టీల నాయకత్వాన ఈసోషలిస్టుదేశాలు క్రమక్రమంగా అభివృద్ధిచెందుతున్నాయి. ఈమధ్య జరిగిన ఘటనలన్నిటిలోకి సోషలిజాన్ని

నిర్మించుటలో చైనా సాధించిన విజయం గణనీయమైనది. చైనా ప్రజలు, తమ ఉదాత్తతకు అర్హమైనట్లు పెద్దయెత్తున సోషలిస్టునిర్మాణంలో ఘనమైన విజయాలు సాధించారు. (సుదీర్ఘ హర్షధ్వానాలు) ఈ ఘటనలఫలితంగా శక్తివంతమైన శాంతి, ప్రజాస్వామ్య, సోషలిస్టుదేశాల శిబిరం ఒకటి ఏర్పడ్డది.

ఇట్టిశిబిరం ఏర్పడటం అంతర్జాతీయంగా చాల ప్రధానమైన ఘటన. వేర్వేరు మార్గాలద్వారా సోషలిజం నిర్మించబడగలదనే ఈ శిబిరం నిరూపించింది. ఈ శిబిరంలోని దేశాల అనుభవం ఫలితంగా, సోషలిజంయొక్క పలుకుబడి, శక్తి సామర్థ్యాలు విస్తారంగా వృద్ధిపొందుతున్నవి. అంతేకాదు, పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గము, కార్మిక ప్రజలు, సుఖజీవితం కొరకు సాగించే పోరాటానికి ఈ శిబిరం నమ్మకమైన నేస్తం. వలస పరాధీనదేశాల ప్రజలు, జాతీయ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపాదించుకునేందుకు, సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్ని దృఢతరం చేసుకునేందుకు జరిపే పోరాటాలను ఈ శిబిరం బలపరుస్తుంది. ఈ విషయం వలస పరాధీన దేశాలలోని ప్రజలకు స్పష్టంగా తెలుసు. ఈ శిబిరం బల పడిన కొద్దీ, వలస పరాధీన ప్రజల పోరాటాలుకూడా బలపడతాయి. (హర్ష ధ్వానాలు)

ప్రపంచ వ్యాపిత పెట్టుబడిదారీ విధానంతోపాటు నేడు ప్రపంచవ్యాపిత సోషలిస్టు విధానంకూడా ఒకటి ఉన్నది. ఈ రెండు విధానాలమధ్య శాంతియుత సహజీవనం నేడొక చారిత్రక అవసరంగా పరిణమించింది. సహజంగానే, ఈ రెండు విధానాలమధ్య విభేదాలు, తగాదాలు అనేకం ఏర్పడుతూ ఉంటాయి. ఇది అని వార్యం. కనుక ఈ రెండు విధానాలమధ్య ప్రస్తుతమున్న తగాదాలు, భవి ష్యత్తులో రాబోయే తగాదాలు ఏలా పరిష్కరించుకోవాలి అనేసమస్యకు ఖచ్చిత మైన సమాధానం మనం ఇవ్వాలి.

ఇందుకు రెండే మార్గాలున్నాయి. రాయబారాలద్వారా, శాంతియుత పరి ష్కారాన్ని సాధించుకోటం ఒకమార్గం. యుద్ధం మరొకమార్గం. ఇంతకు మించి మూడో మార్గంలేదు. సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాలు, యుద్ధం అనే మార్గాన్ని ఖచ్చితంగా నిరాకరించాయి. ఎదరిపక్షం వారిచేతకూడా విభిన్న వ్యవస్థలమధ్య శాంతియుత సహజీవనమనే సూత్రాన్ని అంగీకరింప చేయ టమే మన లక్ష్యం. రాయబారాలద్వారా, అన్ని ముఖ్యమైన అంతర్జాతీయ సమ స్యలపై ఇకముందు ఏర్పడే సమస్యలపైన ఒప్పందానికి రాకటానికి మనం నిర్వి రామమైన కృషిచేస్తాము. అన్ని దేశాల శాంతి భద్రతలను కాపాడటం, దృఢ తరం చేయటం, ఇవే మన లక్ష్యాలు. (సుదీర్ఘ హర్షధ్వానాలు)

కామ్రేడ్ కృశ్చేవ్ తన నివేదికలో నేటి అంతర్జాతీయ పరిస్థితిలోని అతి ప్రధానమైన కొన్ని సమస్యలను ప్రస్తావించారు. ప్రస్తుతయుగంలో యుద్ధాన్ని నివారించటానికిగల అవకాశాన్నిగురించి ఆయన ప్రస్తావించారు. రెండు ప్రపంచ

యుద్ధాలవలన కలిగిన దుష్ఫలితాలను కోట్లకొలది ప్రపంచప్రజలు అనుభవించారు. యుద్ధఫలితంగా, మానవ జీవితానికి ఎంతటి దారుణనష్టాలు సంభవిస్తాయో వారు స్వయంగా చూశారు. రెండు ప్రపంచయుద్ధాల ఫలితంగా 8 కోట్ల పైచిలుకు ప్రజలు, చనిపోవటమో, లేక వికలాంగులు కావటమో జరిగింది. నేటి పరిస్థితులలో మరొక యుద్ధమే సంభవిస్తే అది గడచిన యుద్ధాలకంటె, అత్యంత వినాశకరమూ, ప్రమాదకరమూఐన ఫలితాలను కలిగిస్తుంది. కనుక మనం ఒకేఒక గుణపాఠాన్ని నేర్చుకోవాలి. సమస్త మానవజాతి క్షేమందృష్ట్యా, మనం శాంతిని కాపాడటానికి చేయగలిగిందంతా చేయాలి. ఏఒక్క అవకాశాన్నీ జారవిడువరాదు. శాంతికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలన్నిటినీ ప్రజలకు వివరిస్తూ, బహిర్గతంచేస్తూ ఉండాలి. సామ్రాజ్యవాదుల దురాక్రమణశక్తులకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యంచేసి జాతులమధ్య శాంతికొరకు, స్నేహ సహారాలకొరకు వారిని సమీకరించాలి. (హర్షధ్వానాలు)

మరొక యుద్ధం అనివార్యమా?

సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు యుద్ధాలు అనివార్యమని లెనిన్ చెప్పిన ప్రఖ్యాతసూత్రం మనందరకూ తెలును. సామ్రాజ్యవాదుల పెత్తనం ఉన్నంతవరకు వివిధరాజ్యాలు తమ విభేదాలను బలప్రయోగంద్వారా, చిట్టచివరకు యుద్ధంద్వారా తప్ప మరొకవిధంగా పరిష్కరించుకోలేవు.

మార్క్సిజం - లెనినిజం మరొక విషయాన్నిగూడా బోధిస్తున్నది. సామ్రాజ్యవాదం ఉన్నంతవరకూ యుద్ధాలు రాకటానికి అవసరమైన ఆర్థికపునాదిఉంటుంది. అంతేకాదు, సామ్రాజ్యవాదయుద్ధాలను, సామ్రాజ్యవాదాన్ని సైతం కూలద్రోసే శక్తులను తిరిగి ఆ సామ్రాజ్యవాదమే చేతులారా సృష్టించుకొంటుంది. కొన్ని నిర్దిష్టపరిస్థితులలో అట్టి సాంఘికశక్తులు, యుద్ధాలను సామ్రాజ్యవాదయుద్ధాలను నిరోధించగల శక్తిని కలిగి ఉంటాయి. కనుక యుద్ధం తప్పనిసరిగా అనివార్యం అని చేసే ప్రకటనలు తప్పు.

నేటి పరిస్థితులలో, సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు సైనిక కలహాలు, మరొక ప్రపంచయుద్ధం ప్రజ్వరిల్లే ప్రమాదం ఉండనేఉన్నది.

అయితే యుద్ధప్రమాదం మాత్రం ఉండి, ఆ ప్రమాదాన్ని నివారించగల బలమైన శక్తులు లేకపోతే ఒక పరిస్థితి ఉంటుంది. అలాగాక, యుద్ధాన్ని నివారించగల శక్తులు అందులోను బలమైనశక్తులు ఉన్నప్పుడు, ఈ నూతనశక్తులు యుద్ధాన్ని జయప్రదంగా నిరోధించగల అవకాశం ఏర్పడుతుంది (హర్షధ్వానాలు)

సామ్రాజ్యవాద శిబిరంలోని అత్యంత దురాక్రమణ వాంఛగల వర్గాలు, ఇప్పటికీ, చరిత్రగతినే మార్చవలెనని పథకాలు వేస్తున్నవిషయం మనం మరచిపోలేము.

సోషలిస్టు దేశాలపై దురాక్రమణ జరపతలెననే ఉద్దేశంతో వారువేస్తున్న 'విముక్తి' పథకాలు, 'పరిమితంచేసే' పథకాలు అలాంటివే. సోషలిస్టుదేశాలలో తిరిగి పెట్టుబడిదారీ విధానాన్ని స్థాపించాలనే ఉద్దేశంతో ఇట్టి విడ్డూరమైన పథకాలు వేయటం ఒకవిషయం. నేటి ప్రపంచ పరిస్థితులలో అట్టి పథకాలను ఆచరణలో పెట్టటమనేది వేరేవిషయం. ఎందువల్లనంటే ఇట్టి విడ్డూరపు పథకాలు ఏమాత్రం ఆచరణ సాధ్యంకావని సోవియట్ యూనియన్ అభివృద్ధి, చరిత్ర కంఠోక్తిగా నిరూపిస్తున్నవి. (దీర్ఘహర్షధ్వానాలు)

మొదటి ప్రపంచ యుద్ధానంతరం, ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, అంతర్జాతీయ పరిస్థితిలో వచ్చిన అతి ప్రధానమైన మార్పులు, అందరూ స్పష్టంగా గమనించి వర్గసంబంధాలు, రాజకీయశక్తుల సంబంధాలు మారిపోయాయని వివేచనగల ప్రతివ్యక్తీ నేడు గుర్తిస్తున్నాడు. సామ్రాజ్యవాదులబలం చాలా తగ్గిందని, సోషలిస్టుదేశాల యొక్క, యుద్ధాన్ని వ్యతిరేకించే శాంతికాముక దేశాలయొక్క బలం చాలా పెరిగిందని వివేచనగల ప్రతివ్యక్తి గుర్తిస్తున్నాడు. కనుక యుద్ధం వస్తుందా, రాదా అనే విషయాన్ని నిర్ణయించేశక్తులు, రెండవ ప్రపంచ యుద్ధానికి ముందువలె కాని, లేక మొదటి ప్రపంచ యుద్ధానికి ముందువలెకాని, నేడు లేవని నిస్సందేహంగా చెప్పవచ్చు.

వెనుకటి పరిస్థితులు

మొదటి ప్రపంచయుద్ధానికి పూర్వం, కార్మికవర్గానికి నాయకత్వం వహిస్తున్న సోషలిస్టుపార్టీలు, యుద్ధాన్ని నివారించే కర్తవ్యాన్ని స్వీకరించాయి. "యుద్ధాన్ని నివారించటానికి అంతర్యుద్ధం" అనే నినాదం ఆనాడు ప్రజలలోకి బాగా చొచ్చుకు పోయింది. వివిధదేశాలలో కార్మికవర్గంలో గణనీయమైన భాగాలు పై నినాదాన్ని స్వీకరించాయి. కాని మొదటి సామ్రాజ్యవాద యుద్ధం ప్రారంభమై నిర్ణయాత్మకమైన సమయం వచ్చేసరికి రెండవ అంతర్జాతీయ సంస్థకు చెందిన పార్టీలు ద్రోహంచేశాయి. తత్ఫలితంగా అంతర్జాతీయ కార్మికవర్గం, రాజకీయంగా బలహీనపడ్డది. దానిసంఘటితశక్తి దెబ్బతిన్నది..

బోల్షివిక్ లెనినిస్టుపార్టీయైన మన పార్టీ ఒక్కటే, చివరివరకు, సామ్రాజ్యవాదానికి, సామ్రాజ్యవాద యుద్ధానికి రాజకీయ శత్రువుగా నిలచి, పోరాడింది. ఇతర దేశాలలోని కొందరు సోషలిస్టులు మాత్రం, కార్మికవర్గ అంతర్జాతీయతకు విశ్వాసపాత్రులై నిలబడ్డారు. మనపార్టీ తీసుకున్న వైఖరి, అక్టోబరు సోషలిస్టు విప్లవవిజయానికి మాత్రమేకాక, మొదటి ప్రపంచయుద్ధాన్ని సత్వరము ముగించడానికికూడా, సహాయపడ్డది అనే విషయాన్ని ఎవరూ కాదనలేరు.

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం సోవియట్ యూనియన్ శాంతి సంరక్షణానికై నిర్విరామంగా పోరాడింది. ప్రపంచయుద్ధం రాకుండా నివారిచేం

దుకు ఇతర రాజ్యాలు ఐక్యం కావాలనికూడా హెచ్చరించింది. కాని, జర్మన్ ఫాసిజం, దాని దురాక్రమణ స్నేహితులు బహిరంగంగానే, రెండవ ప్రపంచ యుద్ధానికి సన్నాహాలు చేస్తున్నప్పటికీ, యుద్ధాన్ని నివారించటానికై మనం చేసిన ప్రతిపాదనలను ఇతర రాజ్యాలు బలపరచలేదు. అంతేకాదు, జర్మన్ ఫాసిజాన్ని, సోవియట్ యూనియన్ వైపు మళ్ళించాలనే యత్నాలనుసైతం వారుచేశారు. "ఇతరులచేత నిప్పులోనుండి జీడిగింజలు తీయించాలనే" వైఖరిని వా రవలంబించారు.

ఆ నాటికి సోషలిస్టుదేశం సోవియట్ యూనియన్ ఒక్కటే. సామ్రాజ్య వాదులలోని అత్యంత దురాక్రమణవర్గాల పథకాలను భగ్నంచేయగల సామర్థ్యం, సోవియట్‌కు, దానిపట్ల సానుభూతిగల శాంతికాముక ప్రపంచప్రజలకు లేక పోయింది. అట్టి పరిస్థితులలో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది.

1915 మధ్యలో లెనిన్ చెప్పిన యీ క్రింది వాక్యాలు ఎంత వాస్తవ మైనవో, రెండవ ప్రపంచయుద్ధ ఫలితాలు నిరూపించాయి. లెనిన్ యిలా అన్నారు :

"చరిత్రలో జరిగే ప్రతి సంక్షోభం విపత్తు, ఆకస్మికమార్పువలెనే, యుద్ధం కూడా, కొంతమంది ప్రజలను చకితులనుజేసి, వారి స్థయిర్యాన్ని నాశనంచేస్తుంది. కాని మరికొంత మందిని, ఇదే అనుభవం చైతన్యవంతులనుచేసి రాటు దేలుస్తుంది. ప్రపంచ చరిత్రను మొంత్తగా తీసుకుంటే, ఏదో ఒక రాజ్యంపతనమైనపుడు జరిగే కొన్ని ఘటనల సందర్భంలో తప్ప, మొదటి రకం ప్రజలకంటె, రెండవరకం ప్రజలే సంఖ్యలోను, బలంలోను, అధికులుగా ఉంటూ వచ్చారు."

(లెనిన్ 21 వ వాల్యూం- 191-192 పేజీలు)

మొదటి ప్రపంచ యుద్ధంకంటె, చాలా ఎక్కువగా రెండవ ప్రపంచ యుద్ధం, లక్షలాది ప్రజలను చైతన్య వంతులనుజేసి, రాటు దేల్చింది.

రెండవ ప్రపంచయుద్ధకాలంలోను, ఆ పిమ్మటకూడ కొత్త సాంఘిక రాజకీయశక్తులు తలయెత్తినవి. అనేకదేశాలలో తలయెత్తి ఐక్యమైన యీ కొత్త శక్తుల ఆవిర్భావం, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితిని తీవ్రంగా మార్చివేసింది. యుద్ధఫలితంగా అనూహ్యమైన పట్టుదల, కష్టసహిష్ణుత ప్రజలలో ఏర్పడ్డది. దాంతోపాటు, ముఖ్యంగా యూరప్, ఆసియా ఖండాలలోని కొన్నిదేశాల రాజకీయజీవితంలో అతిప్రధానమైన మార్పులు వచ్చాయి.

నేడు, పరస్పర విరుద్ధ విధానాలు కలిగిన, రెండు ప్రపంచ శిబిరాలున్నవి. సోషలిస్టు శిబిరంలో 90 కోట్లకు మించిన ప్రజ లున్నారు. ఈ శిబిరం యూరపు లోను, ఆసియాలోను వ్యాపించి, ప్రపంచ జనాభాలో మూడవవంతు పైచిలుకు జనాభాను కలిగి, సామ్రాజ్యవాద యుద్ధశిబిరం పక్కనే పెరిగి పెద్దదైంది.

సామ్రాజ్యవాద శిబిరంలో, తమకుగల పెత్తనాన్ని, సౌకర్యాలను కాపాడుకోవాలని తాపత్రయపడే వర్గాలదే, నేటికీ నిర్ణయాత్మకపాత్రగా ఉంది. మరొక యుద్ధం వచ్చినా ఆ వర్గాలకు లెక్కలేదు. కాని సోషలిస్టు శిబిరంలోని పరిస్థితి యిందుకు భిన్నంగా ఉంది.

సామ్రాజ్యవాద దేశాలలోని అత్యంత దురాక్రమణవర్గాలు నేడు మరొక యుద్ధానికి హడావిడిగా సన్నాహాలు చేస్తున్నాయి. కాని సోషలిస్టు శిబిరంలోని దేశాలు శాంతిని కాపాడి, దృఢతరంచేయటం, వివిధదేశాలమధ్య శాంతి, స్నేహ, సహకారభావాలను పెంపొందించటం తమ ప్రధానకర్తవ్యంగా భావిస్తున్నాయి. సోవియట్ యూనియన్, చైనా, తదితర ప్రజాస్వామ్యదేశాలు, తమ ప్రజల ప్రయోజనాలకు మాత్రమేగాక, మొత్తం ప్రపంచప్రజల ప్రయోజనాలకే అనుగుణ్యమైన, అత్యంత ప్రధానమైన, గౌరవప్రదమైన లక్ష్యాలను చేపట్టాయి.

వేర్వేరు దేశాలలో సాంఘిక రాజకీయ వ్యవస్థలు వేర్వేరుగా ఉండవచ్చు. కాని, అందరి ప్రజల ప్రయోజనాలు, శాంతి సాధనవిషయంలో, సోషలిస్టు శిబిరంలోని దేశాల ప్రజల ప్రయోజనాలతో ఏకమౌతున్నాయి. ఈ సోషలిస్టు దేశాలు నిస్వార్థబుద్ధితో ప్రపంచశాంతి కొరకు, దేశాలమధ్య స్నేహ సహకారాల కొరకు నిర్విరామంగా కృషిచేస్తున్నాయి.

యుద్ధప్రమాదాన్ని మనం తక్కువ అంచనా వేయరాదు. అన్ని పరిస్థితులలోను ప్రశాంతమైన జీవితానికి గ్యారంటీ ఏర్పడ్డదనే భ్రమకు లోను కాకూడదు. సామ్రాజ్యవాదుల దురాక్రమణ పథకాలను మనం మెలకువతో కనిపెట్టి ఉండాలి చక్కని ప్రసంగాలు, శాంతికాముక కార్యక్రమాలతో, సామ్రాజ్యవాదులు మారిపోతారనే ఉపేక్షాభావానికి మనం లోనుకారాదు. దీనితోపాటు, మనం సక్రమమైన జాతీయ అంతర్జాతీయ విధానాన్ని అవలంబించాలి. అప్పుడే పైబాధ్యతలవల్ల ఫలితం కలుగుతుంది. సోషలిస్టు రాజ్యాలలోని కార్మికప్రజలు, మరింతగా ఐక్యమై, ఒక కుటుంబంగా మారిపోవాలి. ఈ రాజ్యాల ప్రజలు, పరస్పర సహకార స్నేహ సంబంధాలను మరింత పెంపుచేసుకోవాలి. ఇతర దేశాల ప్రజలలోకూడా మనం అనుసరిస్తున్న శాంతి, అంతర్జాతీయ సహకార విధానాలపట్ల అంగీకారం రోజురోజుకూ వృద్ధికావాలి. మన ప్రజలజీవిత పరిస్థితులను వృద్ధిచేయటానికి ఇతోధిక శ్రద్ధవహించాలి. సోషలిస్టు రాజ్యాల భద్రతను సమర్థవంతంగా కాపాడేందుకవసరమైనచర్య లన్నిటినీ తీసుకోవాలి. ఇవన్నీ జరిగినపుడే మన విధానాలకు ప్రాధాన్యత ఏర్పడుతుంది. (హర్షధ్వానాలు).

వారితోపాటు, శాంతిని కాపాడటానికి మనకుగల అసంఖ్యాకమైన అవకాశాలను, శక్తులను తక్కువ అంచనా వేసుకోరాదు. ఇలా తక్కువ అంచనా వేసుకున్నట్లయితే, శాంతి సంరక్షణకై, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచమంతటా ఆవిర్భవించి దినదినాభివృద్ధి చెందుతున్న శక్తులను వినియోగించుకోలేని

వార మాతాము. యుద్ధానంతరం ఏర్పడిన ప్రపంచ పరిస్థితిని సరిగా అంచనా వేసుకోవాలి. శాంతిని సంరక్షించి, మరొక యుద్ధాన్ని నివారించటానికి ఆయత్త మాతున్న శక్తులకుగల బ్రహ్మాండమైన నైతిక, భౌతిక బలసంపదను గమనించాలి. ఈ శక్తులను సంఘటిత పరచాలి. సమాయత్తం చేయాలి, బలపరచాలి, వృద్ధి చేయాలి. వివిధ దేశాలమధ్య శాంతి, స్నేహం, సహకారాలను సాధించాలంటే, యుద్ధాన్ని నివారించాలంటే, ఈ మహత్తర బాధ్యతలను స్వీకరించాలి.

మనకు అపారమైన భౌతిక, సాంకేతిక బలసంపద ఉన్నదని మన శత్రుశిబిరానికికూడా తెలుసు. అవసరం ఏర్పడితే మనలను మనం రక్షించుకోటానికి అవసరమైన అత్యాధునికమైన, అతిశక్తివంతమైన, వివిధరకాల ఆయుధసామాగ్రి మనకున్నదని వారికి తెలుసు (సుదీర్ఘ హర్షధ్వానాలు). ఈ విషయంలోమన ప్రత్యర్థులు, లోగడ తమకుగల అనేకభ్రమలను ఈ పాటికి విడనాడిఉంటారనే మనం అనుకోవచ్చు. భౌతిక, సాంకేతిక శక్తిసంపద విషయంలో మనం ఇంకా బలపడాలి. ఇంకా శక్తివంతం కావాలి. ఇంకా సంఘటితం కావాలి. మనదేశాన్ని రక్షించుకొని దురాక్రమణను తిప్పికొట్టటానికి అవసరమైన అన్ని పద్ధతులలోను అత్యుత్తమ ప్రావీణ్యత సంపాదించాలి. (దీర్ఘహర్షధ్వానాలు) ఈ భౌతికావకాశాలన్నీ మనకు, మన ప్రత్యర్థులకంటె తక్కువగా ఏమీలేవు. మనకుగల అశేష భౌతిక సంపద, ఆధునిక సాంకేతిక సాధనాలు, అపారమైన మానవశక్తి, మన ప్రజలలో ఉన్న అభేద్యమైన రాజకీయ, నైతిక ఐక్యత - వీటిఫలితంగా, సోషలిస్టు శిబిరం అజేయమని మనకు దృఢవిశ్వాసముంది. (దీర్ఘహర్షధ్వానాలు)

ఈ విషయాలన్నీ ఈ పాటికే అందరికీ స్పష్టమైనవి. కనుక ఇప్పటికీ యుద్ధపథకాలను నిర్మించేవారు, ఇతర దేశాలపై పెత్తనం సంపాదించాలని, మరొక ప్రపంచ యుద్ధాన్ని ప్రజ్వరిల్ల చేయాలనీ, యత్నించేవారు తమ పథకాలు నేటి ప్రపంచ పరిస్థితిలో నిరుపయోగమని గ్రహించగలిగి ఉండాలి.

అంతేకాదు, పెట్టుబడిదారీ దేశాలలోని వ్యాపార వర్గాలలో, బాధ్యతా రహితంగా రాజకీయ జూదాలు ఆడటానికి విముఖులైనవారు, వివిధ దేశాలతో - ఆ దేశాల సాంఘిక వ్యవస్థలు ఏవైనాసరే - ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను పెంపుచేసుకోవలెనని ఆశించేవారు పలువు రున్నారు. ఇట్టి వ్యాపారానికి నేడు విస్తారమైన అవకాశాలుకూడా ఉన్నాయి.

ఇదే సందర్భంలో, చారిత్రక పరిణామంలో ప్రజలే నిర్ణయాత్మకపాత్ర వహిస్తారనే విషయాన్ని మనం మరచిపోరాదు. ప్రజల ఐక్యత, తమ లక్ష్యం న్యాయబద్ధమైనదని ప్రజలకుగల అకుంఠిత విశ్వాసం, ఇదే నిర్ణాయక పాత్ర వహిస్తాయి. అంతర్యుద్ధ కాలంలోను, రెండవ ప్రపంచ యుద్ధకాలంలోను, మన ప్రజలు పై విషయాన్ని ఎట్టిసందేహం లేకుండా నిరూపించారు. సోవియట్ ప్రభుత్వంయొక్క అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడిన ఆ నాడు మన ప్రజలు,

సోషలిస్టు మాతృభూమిని రక్షించుకోవటంతోపాటు, సోషలిస్టు సమాజాభివృద్ధి కవసరమైన అద్భుతమైన విజయాలను కూడా సాధించారు.

సోషలిస్టు శిబిరంలోని ప్రజలమధ్యగల రాజకీయ నైతిక ఐక్యత దినదినాభివృద్ధి చెందుతున్నదని మనం పూర్తి విశ్వాసంతో నేడు చెప్పగలము. ఈ ప్రజలు ఐక్యమై ఉన్నారు. వారి స్నేహం రోజురోజుకు గాఢతరమౌతున్నది, వృద్ధిచెందుతున్నది. స్వతంత్ర సార్వభౌమాధికారాలుగల దేశాలమధ్య సన్నిహిత సమగ్ర స్నేహబంధంగా ఇది పరిణామం చెందుతున్నది. తత్ఫలితంగా ఈ శిబిరంలోని ప్రతిఒక్క దేశంయొక్క బలము, శక్తిసామర్థ్యము పెంపొందుతున్నాయి. ఏ ఒక్క సోషలిస్టు రాజ్యంపై దాడిచేయాలని ఆశించే దురాక్రమణదారు పై విషయాలన్నిటినీ గమనించక తప్పదు (హర్షధ్వానాలు).

శాంతిని సంరక్షించే విషయంలో నేడు ఒక నూతన అంతర్జాతీయ పరిస్థితి ఏర్పడ్డది. పది లేక పదిహేను సంవత్సరాల క్రితం మనం ఇట్టి పరిస్థితిని గురించి కలలు మాత్రం కనగలిగేవారము.

పెట్టుబడిదారీదేశాల చక్రబంధంలో యిరుక్కొని సోవియట్ యూనియన్ ఏకాకిగాఉండే పరిస్థితి నేడు తొలగిపోయింది. అంతేకాదు, యూరపు ఆసియా దేశాలలో సోషలిస్టు శిబిరం, ఒక బ్రహ్మాండమైన శాంతిశిబిరం ఆవిర్భవించింది. శాంతిని సంరక్షించే విషయంలో యీ శిబిరం అవతలకూడా చాలా రాజ్యాలు మనలను బలపరుస్తున్నాయి. వాటిసంఖ్య దినదినాభివృద్ధి చెందుతున్నది.

నేడు సోషలిస్టు శిబిరంలో సమీకరించబడిన ప్రజలుమాత్రమే కాదు, శాంతి సంరక్షణకు కంకణం కట్టుకొన్నవారు. అనేక యితర రాజ్యాలలోకూడా, ముఖ్యంగా నిన్న మొన్నటివరకు సామ్రాజ్యవాదంమీద పూర్తిగా ఆధారపడి ఉండి, నేడు సామ్రాజ్యవాదంతో తెగతెంపులుచేసుకొని స్వతంత్రమార్గాన పురోగమిస్తున్న అనేకరాజ్యాలున్నవి. ఇవి బహిరంగంగా, దురాక్రమణ పథకాలను ఖండిస్తున్నవి. యుద్ధకూటముల నిర్మాణం, ప్రపంచయుద్ధానికి చేసే సన్నాహాలు, తాము సాధించుకున్న స్వాతంత్ర్యానికి ప్రమాదకరమని ఈ దేశాల ప్రభుత్వాలు, ప్రజలూ గుర్తిస్తున్నారు.

వలసవిధాన పతనం

నేడు వలసవిధానం పతనమౌతున్నది. ఈ పతనానికి గల ప్రపంచ వ్యాపిత ప్రాధాన్యతను మనం గమనించాలి. ఆసియా, ఆఫ్రికాలలో స్వతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి. శాంతి, అంతర్జాతీయ సహకారాలకు ఈ పరిణామం దోహదకరం. భారతదేశం చైనా రిపబ్లికుతోకలిసి రూపొందించిన ఐదు సూత్రాలను ఈ సందర్భంలో ప్రస్తావిస్తేచాలు. వివిధజాతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, శాంతియుత సహజీవనం కొనసాగించాలని పై సూత్రాలు స్పష్టం చేశాయి. ఈ సూత్రాలకు

ప్రపంచ వ్యాపితంగా అండదండలు చేకూరినవి. ఇరవై తొమ్మిది ఆసియా, ఆఫ్రికారాజ్యాలు కలిసి, బాండుంగ్ మహాసభను నిర్వహించాయి. వలస బానిసత్వాన్ని త్రోసివేసిన ఆసియా, ఆఫ్రికా ప్రజలపాత్ర – ఈ పాత్ర అన్నిచోట్ల పూర్తిగా వ్యక్తం కాకపోయినప్పటికీ– అంతర్జాతీయ రాజకీయాలలో ఎంతటి ప్రధానశక్తిఐందో మనం గ్రహించగలం.

రోజు రోజుకు అభివృద్ధి అవుతున్న వలస వ్యతిరేక ఉద్యమం, ఆసియా ప్రజల నందరినీ ఆవరించింది. ఇప్పుడు క్రమంగా ఆఫ్రికా ఖండానికిసైతం వ్యాపిస్తున్నది. ఈ ప్రజలు తమ పరిస్థితిని బాగుచేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. మొట్టమొదటి సారిగా తమకు లభించిన అనుకూలమైన అవకాశాలను పూర్తిగా వినియోగించుకునేందుకై యత్నిస్తున్నారు. వారు మరొక ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకులు. అంతేకాదు, సామ్రాజ్యవాదానికి, సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలనేభావం వారిలో గాఢంగా ఉంది.

పెట్టుబడిదారీ దేశాలలో సైతం, విశాల ప్రజాసామాన్యాన్ని కూడకట్టుకున్న, యుద్ధవ్యతిరేక శాంతిఉద్యమం అభివృద్ధి చెందిందని అందరికీ తెలుసు. వర్గచైతన్యంకల మొత్తం కార్మికవర్గం మాత్రమేకాక, రైతాంగంలో గణనీయమైన భాగం, మేధావులు, బూర్జువావర్గంలో పుట్టిన వ్యక్తులు అనేకులు, ఈ శాంతి ఉద్యమంలో పాల్గొంటున్నారు. శాంతిఉద్యమంలో పాల్గొనక పోయినా, మరొక ప్రపంచ యుద్ధంవల్ల ఏర్పడే అపారనష్టాన్ని గుర్తించిన అనేక ఇతర వ్యక్తుల ప్రకటనలుకూడా, శాంతిఉద్యమంతో గొంతు కలుపుతున్నాయి.

దురాక్రమణదారులు, తమ పథకాలను అమలు జరుపుటలో నేడెదుర్కొంటున్నంతటి ఆటంకాలు ఇదివరకెన్నడూ ఎదుర్కోలేదు. తాము దురాక్రమణ విధానాలు సాగిస్తూంటే, ప్రజలు నిస్సహాయులై లొంగి పడివుండే రోజులు గడచి పోయాయి. అయితే ఇంతమాత్రాన, మనలో అలసత్వం ఏర్పడరాదు. పరిస్థితులు వాటంతట అవే చక్కబడతాయన్న భ్రమకు లోను కారాదు.

యుద్ధ వాతావరణాన్ని సృష్టించటానికి, ఆయుధాలను ఇతరదేశాలకు ఎగుమతిచేయటానికి, దురాక్రమణదారులు అనేకమైన ఎత్తుగడలను వేస్తున్నారని మనకు తెలుసు. ఒక కొత్త దురాక్రమణ యుద్ధానికి పథకాలు వేయాలని ఆశిస్తున్నారు. బూర్జువా పత్రికలు, రేడియో, సినీమాలు ఎంత విస్తారంగా ఈ యుద్ధప్రచారానికి వినియోగించబడుతున్నాయో మనకు తెలుసు. వీటిని మనం తక్కువ అంచనా వేయరాదు. కనుక సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలు చూపే ప్రతిఘటన బలహీన పడకూడదు. రోజు రోజుకు బలపడాలి. అభ్యుదయకర సాంఘికశక్తులమధ్య ఐక్యతను సాధించడానికి మరొక యుద్ధాన్ని నివారించటానికై వివిధదేశాల ప్రజలను సమీకరించటానికి, మనం ఇంతవరకూ చేసిన కృషికంటె, ఇంకా ఎక్కువకృషి చేయాలి.

మరొక యుద్ధం రాకుండా నిరోధించటానికై చేయవలసిన పనులన్నిటినీ మనం చేస్తున్నామని చెప్పలేము. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వం ఏర్పడిన కొన్ని అభిప్రాయాలు మనలో ఉన్నవి. సాంప్రదాయసిద్ధమైన కరుడుకట్టిన ఆ అభిప్రాయాలకు మనం తరచు లోనవుతున్నాము.

యుద్ధాన్ని నిరోధించటానికి మరింత విశాలమైన, మరింత చైతన్యవంతమైన కొత్తరూపాలను రూపొందించి, పెంపుచేయటానికి పై భావాలు మనకు అడ్డంకిగా ఉంటున్నవి. యుద్ధానంతర ప్రపంచ పరిస్థితిలో ఏర్పడిన నూతనావకాశాలను మనం తరచు తక్కువ అంచనా వేస్తున్నాము. విదేశాంగ మంత్రిత్వశాఖలోకూడా, యీ లోపం కనపడ్డది. సకాలంలో మన పార్టీ కేంద్రకమిటీ, యీ లోపాన్ని బహిర్గతంచేసి, సవరించింది. ప్రజల శాంతిభద్రతలను కాపాడేందుకు ఏర్పడిన కొత్త అవకాశాలను తక్కువ అంచనావేసే యీ పద్ధతిని మనం విడనాడాలి. సోషలిస్టు ప్రపంచ శిబిరం నిరంతరాయంగా అభివృద్ధిచెందుతున్నందువలన, వలస అధీనప్రజల స్వతంత్రపోరాటాలు యింతకుపూర్వం ఎన్నడూలేనంతగా అభివృద్ధి చెందుతున్నందువలన, పెట్టుబడిదారీ దేశాలలోని చైతన్యవంతమైన కార్మికోద్యమం వలన, కార్మికవర్గ అంతర్జాతీయ సౌహార్దతవలన, శాంతికాముకుల ప్రజాతంత్ర కార్యాచరణవలన మహిళా, యువజన తదితర ప్రజాసంఘాల కార్యక్రమాలవలన, శాంతిరక్షణకోరకు యుద్ధానికి వ్యతిరేకంగా జరుగుతున్న తదితర ప్రజాపోరాటాల వలన అపారమైన యీ నూతన అవకాశాలు ఏర్పడుతున్నవి. (హర్షధ్వానాలు)

విదేశాంగ వ్యవహారాలలో, మనపార్టీ వాస్తవ పరిస్థితుల నాధారం చేసుకొని, పరిస్థితుల చారిత్రాకాభివృద్ధిని దృష్టిలోకి తీసుకొని, తన కార్యాచరణను నిర్ణయించుకుంటుంది. విదేశాంగ విధానంలో సిద్ధాంతాన్ని పరిస్థితుల కనుగుణ్యమైన సర్దుబాటును (Principle and flexibility) జోడించవలెనని, లెనిన్ స్పష్టం చేశాడు. లెనిన్ యొక్క ఈ సిద్ధాంతమే అంతర్జాతీయ రంగంలో మనకు విజయాలను సమకూర్చుతున్నది.

మరొక యుద్ధాన్ని నివారించి, శాంతిని కాపాడటానికి మనం చేసేకృషి, సోషలిస్టుదేశాల అజేయమైనశక్తి సంపదమీద, యుద్ధకూటములను వ్యతిరేకిస్తూ శాంతి విధానాన్ని రోజురోజుకూ బలపరుస్తున్న ఇతరదేశాల సహకారంమీద ఆధారపడి ఉంది. యుద్ధకూటముల నిర్మాణం శాంతి ప్రయోజనాలకు విరుద్ధమైనది. సోషలిస్టు శిబిరంలోలేని ఇతరదేశాలు, విభిన్న సాంఘిక ఆర్థిక వ్యవస్థలుగల దేశాలమధ్య శాంతియుత సహజీవనం అవసరమనే సూత్రాన్ని, బలపరుస్తున్నాయి. ఈ సమస్యపైన ఇండియా, బర్మా, ఇండోనేషియా, ఈజిప్టు తదితర దేశాలు తీసుకొంటున్న వైఖరి శాంతి సంరక్షణలో ఎంతటి ప్రధానపాత్ర వహిస్తున్నదో, ప్రతిఒక్కరికీ తెలుసు.

దురాక్రమణదారుల యుద్ధవ్యవహారాలను భగ్నం చేసేందుకు పోరాడే సందర్భంలో, లెనిన్ చెప్పినట్లు, వివిధ దురాక్రమణ కూటములకు మధ్య, ఆర్థిక, రాజకీయ వైరుధ్యాలున్నాయని, అవి రోజురోజుకూ పెరుగుతున్నాయని బలహీనమైన తన సహచరులను కబళించడానికి ఎక్కువబలం కలిగిన సామ్రాజ్య వాదదేశాలు పూనుకునే సందర్భాలలో, ఇట్టి వైరుధ్యాలు అనివార్యమని, మనం గుర్తుంచుకోవాలి. ఈ వైరుధ్యాలు దురాక్రమణ పరులను బలహీన పరుస్తాయి. శాంతి సంరక్షణావకాశాలను ఎక్కువ చేస్తాయి.

కార్మికవర్గ పార్టీలమధ్య ఐక్యత

మరొక యుద్ధప్రమాదాన్ని అరికట్టి శాంతిని సంరక్షించాలంటే, కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలురెండూ, కార్మికవర్గ ఐక్యత విషయమై శ్రద్ధవహించ వలసిన అవసరంఉంది. కార్మికవర్గం మధ్యగల అనైక్యతను అవకాశంగా తీసుకొని, దురాక్రమణదారులు రెండు సార్లు యుద్ధాలకు సన్నాహాలు చేయుటమే గాక, యుద్ధాలను రెచ్చగొట్ట గలిగారన్న గుణపాఠాన్ని కార్మికవర్గం గ్రహించాలి. ప్రపంచ ప్రజలను మరొక యుద్ధప్రమాదం నుండి రక్షించట మనే మహత్తర లక్ష్యాన్ని సాధించే సందర్భంలో, సోషలిస్టు సమాజనిర్మాణాని కవలంబించవలసిన పద్ధతుల విషయమై సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలకుగల అభిప్రాయ భేదాలు, కార్మికవర్గ అనైక్యతకు ఆధారంకావటం ఏమాత్రం సమర్థనీయంకాదు. కార్మిక వర్గం ఐక్యత సాధించగలిగి నట్లయితే, అంతర్జాతీయ కార్మికవర్గ ఐక్యత యుద్ధోన్మాద శక్తులకు దాటటానికి వీలుకాని అడ్డంకులను నిర్మించగలదు. కార్మికవర్గం నిజంగా ఐక్యమై శాంతిని సంరక్షించటానికి తనకుగల పట్టుదలను యావత్తూ ప్రదర్శించినట్లయితే,మరొక యుద్ధంరానేరాదు. (సుదీర్ఘ హర్షధ్వానాలు).

శాంతికొరకు సోవియట్ యూనియన్ సాగిస్తున్న కృషి

కామ్రేడ్ కృశ్చేవ్ తన నివేదికలో వివరంగా అంతర్జాతీయ పరిస్థితిని సమీక్ష చేశారు. కనుక ఈ మధ్యకాలంలో జరిగిన ఘటనలను గురించి, సోవియట్ యూనియన్ చొరవతో తీసుకున్న శాంతిస్థాపక చర్యవల్ల కలిగిన ఫలితాలను గురించి తిరిగి ప్రస్తావించ నక్కరలేదు. కాని, మనం అంతర్జాతీయ రంగంలో తీసుకున్న చర్యల ప్రత్యేక ప్రాధాన్యతను గురించి, అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించేందుకై మనం అవలంబిస్తున్న సాధారణ విధానాన్ని గురించి మాత్రం కొంత నొక్కి చెప్పవలసిన అవసరం ఉంది.

యుగొస్లేవియాతో స్నేహ సంబంధాల పునరుద్ధరణ విషయం పరిశీలిద్దాం. ఈ సంబంధాలు రోజురోజుకూ బాగుపడుతున్నవి. ఇలా జరగడం ఉభయ దేశాలకు లాభకరం. అంతేకాదు, శాంతి, అంతర్జాతీయ భద్రతలకుకూడా ఇలా జరగటం లాభకరం. సోవియట్ యూనియన్ యుగోస్లేవియాల మధ్య అంతకు

పూర్వం చాలా కాలం కొనసాగిన అసాధారణపరిస్థితులవలన ప్రపంచశాంతికి శత్రువులైన వారికి ఆనందం కలిగిన విషయం గమనించాలి.

ఆస్ట్రియాతో మనం సంధిచేసుకున్నాము. శాశ్వతంగా తటస్థ విధానాన్ని అవలంబించడానికి ఆస్ట్రియా ప్రభుత్వం అంగీకరించి, వాగ్దానంచేసింది. యూరపులోను, తదితర ప్రాంతాలలోను దురాక్రమణ కూటాలను ఏర్పరచుటలో రోజురోజుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్న వర్గాలుసైతం పైసంధికి అంగీకరించక తప్పలేదు. జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్‌కు, సోవియట్ యూనియన్‌కు మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు, మనకుగల సంబంధాలు మరింత దృఢపడ్డాయి. యూరపులో శాంతిని సుస్థాపితం చేసేందుకు ఈ చర్యలన్నీ తోడ్పడతాయి. యూరపులో సమిష్టి భద్రతా వ్యవస్థను ఏర్పరచాలని సోవియట్ యూనియన్ చేసిన ప్రతిపాదనలను అనేక వర్గాలు బలపరచాయి. ఆసియాలో ఒక సమిష్టి భద్రతా వ్యవస్థను ఏర్పరచాలన్న చైనా ప్రభుత్వ ప్రతిపాదనను, సోవియట్ యూనియన్ హృదయ పూర్వకంగా బలపరుస్తున్నది. ఆయుధబలాన్ని తగ్గించేందుకు, అణు ఆయుధాలను నిషేధించేందుకు, సోవియట్ యూనియన్ ఎడతెగని పోరాటం సాగిస్తూనేఉంది.

గత సంవత్సరం జులైలో, జెనీవాలో జరిగిన నాలుగు రాజ్యాల అధిపతుల సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నది. అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించడానికిగల నిజమైన అవకాశాలను ఈ సమావేశం స్పష్టంగా రుజువు చేసింది. ప్రత్యర్థి శిబిరంలోని పెద్దరాజ్యాలతో, సోవియట్‌కు గల సంబంధాలను కూడా ఈ సమావేశం స్పష్టంచేసింది. అయితే ఈ దేశాలతో సంబంధాలను వృద్ధిచేసుకొనే సందర్భంలో మరికొన్ని ఆటంకాలు అలాగే ఉన్నాయని, తరువాత జరిగిన ఘటనలు తెలియజేశాయి. ఈ ఆటంకాలను, "బలం పెంచుకుని బేరమాడాలి" అనే సంకుచిత దృష్టితో కూడిన విధానాన్ని చేపట్టుతున్నవర్గాలు కలిగిస్తున్నాయి. సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టుదేశాలకు సంబంధించి నంతవరకు, ఈ విధానం పూర్తిగా విఫలమై తీరుతుంది.

యూరపు, అమెరికాలలోను, ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యంలోను, యింకా అనేకచోట్ల యుద్ధకూటములను నిర్మించేవిధానాన్ని అమెరికాలోని కొన్ని సుప్రసిద్ధమైనవర్గాలు ప్రోత్సహిస్తున్నాయనే విషయం అందరికీ తెలిసినదే. ఈ సందర్భంలో అమెరికా, బ్రిటన్‌ల నాయకత్వాన ఏర్పడిన ఉత్తర అట్లాంటిక్ కూటమికిగల ప్రత్యేక ప్రాధాన్యతకూడా అందరికీ తెలిసినదే. అమెరికాలోని కొన్నివర్గాలు చేస్తున్న విపరీతమైన వత్తిడిఫలితంగానే, ఉత్తర అట్లాంటిక్, తదితర దురాక్రమణ కూటములలోని అనేక సభ్యరాజ్యాలు ఆయుధీకరణ కార్యక్రమానికి పూనుకుంటున్నాయి. సైనిక బడ్జెటులను పెంచుతున్నాయి. ప్రజలపై పన్నులభారం పెంచి, కృత్రిమంగా యుద్ధవాతావరణాన్ని కలిగిస్తున్నాయి.

సోవియట్, చైనా తదితర ప్రజాస్వామ్యదేశాలకు దురాక్రమణవాంఛ లున్నాయని, నీలాపనిందలను ప్రపంచమంతటా ప్రచారం చేస్తున్నాయి.

హిట్లరిజం పతనమై జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ ఆవిర్భవించిన మీదట, సోవియట్ యూనియన్ పైనగాని లేక మరే ఇతర ప్రజాతంత్ర రాజ్యంపైనగాని దాడిచేయటానికి సిద్ధపడే దురాక్రమణ రాజ్యం ప్రస్తుత పరిస్థితులలో యూరప్ ఖండంలోలేదు. నేటి యూరప్, యుద్ధానికి పూర్వమున్న యూరప్ వంటిది కాదు. ఆ నాడు హిట్లర్ జర్మనీ, ఒక్కొక్క అడుగేసుకుంటూ, రెండవ ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించింది. అయితే, పశ్చిమ జర్మనీలో పునరాయుధీకరణ చేయటానికి జరుగుతున్న పథకాలను మనం గమనించకుండా ఉండలేము. పశ్చిమ జర్మనీ దురాక్రమణ కూటముల్లైన, ఉత్తర అట్లాంటిక్ కూటమిలోను, పశ్చిమ యూరప్ యూనియన్‌లోను, సభ్యరాజ్యంగా చేర్చుకోబడినది. పశ్చిమ జర్మనీ పునరాయుధీకరణ, నిస్సందేహంగా, వైరుధ్యాలను, తగాదాలను వృద్ధిచేస్తుంది. సామ్రాజ్యవాద దేశాలమధ్యగల వైరుధ్యాలు సైతం తీవ్రతరమౌతాయి.

ప్రాచ్యదేశాలలో నూతనయుగం ఆవిర్భవిస్తున్నది. జపాను సైనిక రాజ్యం అస్తమించింది. చైనా ప్రజారిపబ్లిక్ ఏర్పడ్డది. చైనా ప్రభుత్వం, తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోటానికి తనకు పూర్తి సమర్థత కలదని నిరూపించుకున్నది. ఖచ్చితమైన శాంతి విధానాన్ని అవలంబిస్తున్నది. కనుక మూడవ ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించే దురాక్రమణ రాజ్యం ప్రస్తుతానికి ఆసియా ఖండంలో లేదు. దక్షిణకొరియాను మినహాయిస్తే, ఆసియాలో దురాక్రమణ ప్రమాదం, అమెరికన్ సైనిక స్థావరంగా మార్చివేయబడిన తైవాన్ విషయంలో మాత్రమే ప్రధానంగా ఉన్నది. చైనా భూభాగంపై దాడిచేయాలనే దురుద్దేశమే లేకపోతే, తైవాన్‌ను అమెరికా తన సైనిక స్థావరంగా చేసుకోవలసిన అవసరమే లేదు.

అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించటానికి జరిగే కృషిలో ఇంకా అనేక అవరోధాలున్నాయని వాస్తవిక విషయాలు తెలియజేస్తున్నాయి. కాని ఎన్ని ఆటంకాలున్నా, ఎన్ని కొత్త ఆటంకాలు ఆయా సమయాలలో ఏర్పడినా, సోవియట్ యూనియన్ అన్నిదేశాలతోను తన స్నేహసంబంధాలను పెంపు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది, ఈనాడూ స్పష్టం చేస్తున్నది.

అన్నిరాజ్యాలు, ముఖ్యంగా అగ్రరాజ్యాలు, ఎన్ని విభేదాలున్నా, శాంతిని రక్షించాలనే సమిష్టి ప్రయోజన సాధనకై ఐక్యంకావలెనని మనము విశ్వసిస్తున్నాము.

అమెరికా, సోవియట్ యూనియన్‌లమధ్య స్నేహ సంబంధాలు అధికంగా అభివృద్ధికావటం విశ్వశాంతికి ఎంత అవసరమో ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. సోవియట్ ప్రజలవలెనే, అమెరికా ప్రజలు, తదితర ప్రపంచ ప్రజలందరూ

ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారనే మేము విశ్వసిస్తున్నాము. ఈ పరిస్థితులను గమనించి, కామ్రేడ్ బుల్గానిన్, అమెరికా అధ్యక్షులైన ఐసెన్ హోవర్‌కు ఒక సందేశం పంపారు. సోవియట్, అమెరికా దేశాలమధ్య స్నేహ సహకారసంధి చేసుకుందామని ఆ సందేశంలో కామ్రేడ్ బుల్గానిన్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న వైఖరి ఒక విషయాన్ని స్పష్టంచేస్తున్నది. అపరిష్కృతసమస్యలను రాయబారాలద్వారా కాక యుద్ధంద్వారా పరిష్కారంచేయాలని వాంఛించేవర్గాలు అమెరికాలో బలంగావున్నాయి. వారు అమెరికాఅధ్యక్షునిమీద, ప్రభుత్వంమీదచెప్పుకోతగిన పలుకుబడిని కలిగించగలుగుతున్నారు. కాని, ఇతర ప్రపంచప్రజలు ప్రయోజనాలవలెనే, అమెరికాప్రజల ప్రయోజనాలుకూడా శాంతిని మరింతగా సంరక్షించుటలోనే ఇమిడి ఉన్నాయి. కనుక సోవియట్, అమెరికా సంబంధాలను పెంపుచేసేందుకై మనం చేసే ప్రయత్నాలను అమెరికా సరియైన ధోరణిలోనే అర్థం చేసుకుంటుందని ఆశించుదాము.

ఈ ప్రతిపాదన చేయుటద్వారా, శాంతి ప్రపంచ భద్రతలసాధనకు గాను, అమెరికా సోవియట్ దేశాల స్నేహసహకారాన్ని సోవియట్ ప్రభుత్వం గాఢంగా వాంఛిస్తున్నదన్న విషయం మరొకసారి రుజువైంది. అన్నిదేశాలమధ్య సహకారాన్ని వృద్ధిచేయాలన్న ఐ. రా. స. సూత్రాలకు ఆశయాలకు ఈ ప్రతిపాదన అనుగుణ్యంగా ఉన్నది.

బ్రిటన్‌తో మన సంబంధాలను పెంపుచేసుకోవలెననేవిషయంలో కూడా మన పాత అభిప్రాయాలు ఏమీ మారలేదు. మన దేశనాయకులు త్వరలో బ్రిటన్ వెళ్ళుచున్నారు. ఉభయులమధ్య అవగాహన వృద్ధిచెంది, అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించేందుకు ఐక్యకృషి చేసేటందుకు ఈ పర్యటన కొత్త అవకాశాలను కలిగించగలదు. ఫ్రాన్సుతో స్నేహసంబంధాలను ఏర్పరుచుకోవలెనని సోవియట్ యూనియన్ కోరుతున్నది. ఫ్రాన్సు- సోవియట్ దేశాలమధ్య సంబంధాలు వృద్ధికావాలన్న ఖచ్చితమైన అభిప్రాయాన్ని ప్రస్తుత ఫ్రెంచి ప్రభుత్వం వెలిబుచ్చింది. ఫ్రెంచి ప్రభుత్వం నిరాయుధీకరణ ప్రతిపాదనపట్ల ప్రత్యేకశ్రద్ధను కనపరుస్తున్నది. కనుక ఫ్రాన్సుతోకలిసి ఈ సమస్యా పరిష్కారంలో కొంత అభివృద్ధి సాధించటానికి మనము కృషిచేసాము. ఫ్రాన్సులో ఈ మధ్యజరిగిన ఎన్నికల ఫలితంగా ప్రజాతంత్ర శక్తులబలం వృద్ధిచెందింది. ఈ మార్పు నిరాయుధీకరణ సమస్యా పరిష్కారానికి దోహదం కాగలదని ఆశించుదాము.

సోవియట్ యూనియన్ అన్నిదేశాలతోను - అవి పెద్దవికాని - చిన్నవికాని - స్నేహసంబంధాలను స్థాపించుకోనవలెనని మొదటినుండీ కోరుతూనే ఉన్నది. ముఖ్యంగా టర్కీ, ఇరాన్, పాకిస్తాన్, జపాన్ లాంటి దేశాలతో అట్టి సత్సంబంధాలను వాంఛిస్తున్నది. సోవియట్ యూనియన్‌కు యీ దేశాల సత్సంబంధాలు ఏర్పడటం అందరి ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటుంది.

శాంతిపోరాటరంగాన్ని వీలైనంత విస్తృతంచేసే ఉద్దేశంతో సోవియట్ ప్రభుత్వం, మన పార్టీ అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించేవిధానం చేపట్టింది. అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించాలనే యీ విధానం, నేటి పరిస్థితులలో శాంతి పోరాటంయొక్క నిర్దిష్టరూపం. అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించే యీ విధానం ప్రస్తుత పరిస్థితులలో శాంతిపోరాటాన్ని సాగించేందుకు చాలా ప్రయోజనకరమైన పరిస్థితుల కనుగుణ్యమైన విధానం. ఈ పోరాటంలోకి వివిధ సామాజికశ్రేణులకు చెందిన ప్రజానీకాన్ని, వారి రాజకీయాభిప్రాయా లెలావున్నా సమీకరించగల అవకాశం ఉంది. ఈ విధానంద్వారా శాంతిపోరాటంయొక్క సరిహద్దులు అదివరకటికంటె విస్తరిస్తాయి. వివిధ ప్రభుత్వాలమధ్య, ప్రభుత్వసంస్థలమధ్యనే కాక, వివిధదేశాల వ్యక్తులమధ్య, ఆర్థిక సాంస్కృతిక రంగాలలోను, పరస్పర సంబంధాలు పెంపుచెందే అవకాశం ఏర్పడుతున్నది.

దౌత్యప్రతినిధులు, రాజకీయవేత్తలు మాత్రమేకాక, ఆర్థిక, సాంస్కృతిక నాయకులు సైతం, అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించేందుకు సాయపడగలరు. అంతేకాదు, వివిధ దేశాలమధ్య ప్రభుత్వ, సమిష్టి, వ్యక్తిగత సంస్థల మధ్య ఏదో ఒక రంగంలో, ఆ స్నేహసంబంధాలను పెంపుచేయగల వారందరూ, వివిధ దేశాల అధికార ప్రతినిధులూ, అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించేందుకు సాయ పడగలరు. వివిధ దేశాలమధ్య వ్యాపార సంబంధాలు వృద్ధికాకుండా చేసేందుకు, దురాక్రమణ వర్గాలు వీలైనంత కృషిచేస్తున్నాయంటే, అది యాదృచ్ఛికం కాదు. సాధారణ, శాస్త్రీయ, సాంకేతిక, వైజ్ఞానిక సంబంధాలను ఏర్పరచుకునేందుకు సైతం అనేక దేశాలలో ఆటంకాలు ఏర్పడుతున్నాయనే విషయమూ, యాదృచ్ఛికం కాదు.

◆ ◆ ◆

కామ్రేడ్స్, మన పార్టీ, సోవియట్ ప్రభుత్వమూ, ఎల్లప్పుడూ శాంతి ప్రయోజనాలను రక్షించటానికి కంకణం కట్టుకున్నాయి. మన విదేశాంగ విధానం కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన దాని కేంద్ర కమిటీ ఆధ్వర్యాన నిర్వహించ బడు తున్నది. సోవియట్ యూనియన్‌యొక్క అంతర్జాతీయ స్థానాన్ని బలపరచే విషయాలలోను, ప్రపంచశాంతిని సంరక్షించే విషయంలోను, మనం పొందిన విజయాలన్నిటికీ, మనం మనపార్టీకి దాని కేంద్రకమిటీకి ఎంతో ఋణపడి ఉన్నాము. (హర్షధ్వానాలు).

మనదేశ ఆంతరంగిక విధానంలో మనం పెద్ద విజయాలను సాధించాము. విదేశాంగ విధానంలో ప్రముఖమైన విజయాలను పొందాము. పందొమ్మిదవపార్టీ మహాసభ అనంతరం, పార్టీ కేంద్రకమిటీ లెనినిస్టు సూత్రమైన సమిష్టి నాయకత్వ సూత్రాన్ని ఆచరణలోపెట్టి నందువలననే మనం పై రెండు రంగాలలోను విజయాలను సాధించగలిగాము. (హర్షధ్వానాలు) మొత్తం పార్టీయొక్క సహ

కారంలో పార్టీ కేంద్రకమిటీ వ్యక్తిపూజా సూత్రానికే వ్యతిరేకంగా ఖచ్చితమైన వైఖరి అవలంబించింది. ఈ సూత్రం మార్క్సిజం - లెనినిజానికి విరుద్ధమైనది. ఈ సూత్రంవల్ల ఒక నిర్దిష్టకాలంలో అనేక వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. నేటి కాంగ్రెసు, కేంద్రకమిటీ తీసుకున్న ఈ వైఖరిని హృదయ పూర్వకంగా బలపరుస్తుందని, దృఢవిశ్వాసంతో చెప్పవచ్చు (హర్షధ్వానాలు).

అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించి, సోవియట్ ప్రభుత్వంయొక్క స్థానాన్ని బలపరిచే ఉద్దేశంతో చొరవతీసుకొని, అనేకమైన ముఖ్యచర్యలను తీసుకున్నది.

మనపార్టీ కేంద్రకమిటీ, మన ప్రిసిడియం, విదేశాంగ వ్యవహారాలలో, ఈ మధ్య తీసుకున్నంత ఎక్కువగా ఇంతకు పూర్వం ఎన్నడూ ప్రత్యక్షశ్రద్ధ తీసుకోలేదు. మనందరికీ ఈ క్రింది ఘటనలు గుర్తులో ఉన్నాయి. కామ్రేడ్స్, క్రుశ్చేవ్, బుల్గానిన్, మికోయాన్ల నాయకత్వాన మన ప్రభుత్వ ప్రతినిధివర్గం ఒకటి యుగోస్లేవియా వెళ్ళివచ్చింది. తత్ఫలితంగా, సోవియట్ యుగోస్లావ్ సంబంధాలలో గొప్ప అభివృద్ధికరమైన మార్పువచ్చింది. కామ్రేడ్స్ బుల్గానిన్, క్రుశ్చేవ్లు ఇండియా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్ దేశాలు పర్యటించివచ్చారు. తత్ఫలితంగా సోవియట్ ప్రభుత్వంమధ్య, ఆ దేశప్రభుత్వాలమధ్య, ఉభయప్రజలమధ్య, సత్సంబంధాలు ఎంతగానో వృద్ధిఐనవి. మాస్కోలో జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ ప్రతినిధులతోను, ఆ పిమ్మట జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ ప్రతినిధులతోను చర్చలు జరిగాయి. గత వసంతకాలంలో, ఫిన్లండు నార్వేదేశాలతో సంప్రతింపులు జరిగాయి. ఇతరదేశాల రాజకీయ వేత్తలతో సోవియట్ నాయకులు ఇదివరకటికంటె తరచుగా సమావేశాలు జరుపుతున్నారు. సోవియట్ ప్రభుత్వంలోను, పార్టీలోను ప్రముఖస్థానం వహిస్తున్న నాయకులు, విదేశాంగ వ్యవహారాలలో చూపుతున్న శ్రద్ధకు ఈ ఘటనలన్నీ నిదర్శనాలు. సరిగ్గా ఈ కారణంవలననే, అంతర్జాతీయ ఉద్రిక్తతను కొంతవరకు తగ్గించే అనుకూల ఫలితాలు కలిగాయి. ఈ రంగంలో ఇంకా విజయాలు సాధించటానికి నిశ్చితమైన అవకాశాలు ఏర్పడ్డాయి. (హర్షధ్వానాలు)

శాంతిని పరిరక్షించుటలో, మన పార్టీ సోవియట్ ప్రభుత్వమూ స్పష్టమైన విజయాలను సాధించాయి. ఈ విజయాలన్నిటికీ మన ప్రజలు, సోషలిస్టు శిబిరంలోని మొత్తం ప్రజలు, భౌతిక, నైతికశక్తులలో పొందిన అభివృద్ధి పునాదిరాయిగా ఉపకరించింది.

దీని అర్థం ఏమిటి ?

ప్రతి సోవియట్ పౌరుడు, సోషలిస్టు శిబిరంలోని దేశాలలోని ప్రతి పౌరుడు, తన జయప్రదమైన కృషిద్వారా పరిశ్రమలలోను, సమిష్టిక్షేత్రాలలోను సాధించిన విజయాలద్వారా, పెద్దవిషయాలలోమాత్రమే గాక, చిన్నవిషయాలలో

సైతం పొందిన విజయాలద్వారా సోవియట్ ప్రభుత్వాన్ని, మొత్తం సోషలిస్టు శిబిరాన్ని, ప్రపంచ శాంతిభద్రతలను బలపరుచటలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడన్నమాట (హర్షధ్వానాలు). మనం ఒక ఫ్యాక్టరీలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచామంటే, ధాన్యపు దిగుబడిని, సమిష్టి లేక ప్రభుత్వక్షేత్రంలో పశుపోషణను వృద్ధిచేశామంటే, కమ్యూనిస్టు సమాజ నిర్మాణంలో మనం సాధిస్తున్న యీ విజయాలనుగురించి, మనం నిజంగా గర్వపడటానికి హక్కున్నది. అదే సమయంలో, యీ విజయాలు మొత్తం సోషలిస్టు శిబిరం అంతర్జాతీయ రంగంలో నిర్వహిస్తున్న పాత్రను బలపరుస్తున్నాయి. ఆ విధంగా యీ విజయాలు, మొత్తం ప్రపంచప్రజలు శాంతియుతమైన, సుఖమయమైన జీవితాన్ని గడపటానికి అవసరమైన నిర్ణయాత్మక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. (హర్షధ్వానాలు)

ఆర్థిక వైజ్ఞానిక రంగాలలో మనం సాధిస్తున్న విజయాలు ప్రపంచ ప్రజలనందరినీ, ఉత్సాహపరుస్తున్నాయి. తద్వారా వారికొక సంతృప్తి, విశ్వాసం కలుగుతున్నాయి. సుఖమయమైన నూతన జీవితంవైపు లక్షలాది ప్రజలు పురోగమిస్తున్న నూతనమార్గం ఒకటున్నదని, ప్రపంచ ప్రజలు తద్వారా గ్రహిస్తున్నారు. అన్నిదేశాలలోను, మన మిత్రుల, స్నేహితుల సంఖ్య దిన దినాభివృద్ధి చెందుతున్నది. కమ్యూనిస్టులమైన మనవలెనే, వారుకూడా, సామ్రాజ్యవాద యుద్ధాలను నివారించి, శాంతిని కాపాడాలని కోరుతున్నారు. మరొక ప్రపంచ యుద్ధాన్ని నివారించాలంటే ప్రజల చైతన్యం, కృషి, అత్యవసరమని వారు రోజు రోజుకూ మరింత దృఢంగా విశ్వసిస్తున్నారు.

సోషలిస్టు శిబిరంలోని ఇతరదేశాలతో కలిసి, సోవియట్ యూనియన్ శాంతికొరకు, కమ్యూనిజం విజయంకొరకు జరిగే పోరాటంలో అగ్రశ్రేణిలో నిలబడి ఉంది. మన అనుచరులంతా ఐక్యమై ఉన్నారు. ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంతగా అంతిమ విషయంలో మనకు విశ్వాసం ఏర్పడ్డది (హర్షధ్వానాలు).

మార్క్సిజం- లెనినిజం, జండాక్రింద మనం ఇంతవరకూ విజయాలు సాధిస్తూవచ్చాము. ఇకముందు కూడా విజయాలు సాధిస్తాము. ఈ జండాక్రింద కమ్యూనిజం విజయం పొందుతుందని, కొత్తవిజయాలను సాధిస్తామని, దృఢవిశ్వాసంతో మనం పురోగమిస్తున్నాము.

మహత్తరమైన మన నిర్మాణకృషి, శాంతికొరకు మనం జరిపే ఖచ్చితమైన పోరాటం, ప్రపంచప్రజ లందరియొక్క, మొత్తం మానవకోటియొక్క ప్రయోజనాలకు అనుగుణ్యంగా ఉంది. (ప్రచండ దీర్ఘ హర్షధ్వానాలు)

★

BCP

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA113B198
పుస్తకం పేరు	సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ మ్యూనిస్టుపార్టీ 20వ మహాసభలో
తారీఖు	11 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	27
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	C1, BC1
లేని పేజీలు	no
తయారు చేసినది	mary
పేజీలు విడదీసినది	Balakshmi
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good